





# కరపత్రం

SINCE 2014

శనివారం డిసెంబర్ 13 2025 | సంపుటి : 2 | సంచిక : 69 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4




## తప్పుడు ఆరోపణలు చేస్తే
# కాళ్లు విరగ్గొడుతా

» ఎప్పటికైనా నేనూ ముఖ్యమంత్రిని అవుతా
» బిఆర్ఎస్ అక్రమాలపై విచారణ చేయిస్తా
» పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఒక్క రూపాయి సంపాదించలేదు
» పార్టీ నుంచి బయటకు పంపినా వారి కళ్లు చల్లారలేదా
» తనపై తప్పుడు ప్రచారం చేయిస్తున్న హరీష్ రావు
» ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావులకు నోటీసులు
» వారం రోజుల్లో క్షమాపణలు చెప్పాలని కవిత డిమాండ్

**హైదరాబాద్,డిసెంబర్12 :**
తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో మరో సంచలన పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వరరెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, టీ న్యూస్‌లకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత శుక్రవారం లీగల్ నోటీసులు పంపించారు. ఈ నోటీసులో పలు అంశాలను ప్రస్తావించారు. తనపై, తన భర్త అనిల్‌పై ఆధారాలు లేని ఆరోపణలు చేశారంటూ నోటీసులో తెలిపారు. వారం రోజుల్లో తనకు బహిరంగ క్షమాపణ చెప్పాలని కవిత డిమాండ్ చేశారు.



## హైదరాబాద్‌లో అఖిలేశ్ యాదవ్

### సిఎం రేవంత్, కెటిఆర్‌లతో
# వేర్వేరుగా భేటీ

**హైదరాబాద్,డిసెంబర్12 :**
నగరానికి వచ్చిన ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో అఖిలేష్ యాదవ్ భేటీ అయ్యారు. వివిధ రాష్ట్రాలు, జాతీయ స్థాయిలో రాజకీయ పరిస్థితులపై ఇరువురు చర్చించారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అఖిలేష్‌కు రేవంత్‌రెడ్డి వివరించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
తెలంగాణలో ఉత్తర్ ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, సమాజ్ వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ పర్యటిస్తున్నారు. అధికార, ప్రతిపక్ష నేతలను కలుస్తూ తాజా రాజకీయ పరిస్థితులపై చర్చిస్తున్నారు. జూబ్లీ హిల్స్‌లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసానికి వెళ్లిన అఖిలేశ్.. ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు.
ఆ తర్వాత కాసేపటికి నందినగర్‌లోని కేటీఆర్ నివాసానికి అఖిలేశ్ యాదవ్ చేరుకోగా బీఆర్ఎస్



నాయకులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేటీఆర్, హరీష్ రావుతో భేటీ అయ్యారు. తెలంగాణ తాజా రాజకీయ అంశాలపై నేతలంతా చర్చించారు. అనంతరం హైదరాబాద్ ఎమ్మెల్యే క్వార్టర్స్ వద్దకు
చేరుకున్న అఖిలేశ్.. యాదవ సంఘాల సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు. వేర్వేరు పార్టీల్లో ఉన్నా యాదవులంతా ఒక్కటేనని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. రాజకీయాలకు అతీతంగా అందరం కలుసుకున్నట్లు చెప్పుకొచ్చారు. సదర్ సమ్మేళనానికి గొప్పగా ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. యూపీలో బీజేపీని వెనక్కి నెడుతున్నామని.. ఏపీ సపోర్ట్ లేకపోతే కేంద్రంలో బీజేపీ వచ్చేది కాదని అఖిలేష్ యాదవ్ తెలిపారు.





2లో

# ఫ్యూచర్ సిటీ, మూసీ పునర్జీవం, వ్యవసాయాధారిత రంగాలు

◆ ఐటీ, ఫార్మా, డిఫెన్స్ రంగాల్లో పెట్టుబడులకు అవకాశం
◆ జర్మనీ ప్రతినిధి బృందంతో డిప్యూటి సిఎం భట్టి, శ్రీధర్ బాబుల చర్చ

**హైదరాబాద్,డిసెంబర్12(ఆర్ఎన్ఎ):**
ఐటీ, ఫార్మా, డిఫెన్స్ రంగాల్లో తెలంగాణలో భారీ పెట్టుబడుల అవకాశాలు ఉన్నాయని, జర్మన్ కంపెనీలు రాష్ట్రంతో కలిసి పనిచేసేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తుందని డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. భవిష్యత్ దృష్టితో నిర్మాణంలో ఉన్న భారత్ ఫ్యూచర్ సిటీ, మూసీ పునర్జీవనం, వ్యవసాయ ఆధారిత రంగాల అభివృద్ధి వంటి ప్రాజెక్టుల్లో కూడా జర్మన్ సంస్థలకు కీలక అవకాశాలు ఉన్నాయని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వం, జర్మనీ మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా శుక్రవారం ప్రజాభవన్‌లో కీలక సమావేశం జరిగింది.



## ఫోన్ ట్యాపింగ్ కేసు..
# సిట్ ఎదుట ప్రభాకర్ రావు సరెండర్

**హైదరాబాద్:**
తెలంగాణలో రాజకీయ ప్రకంపనలు సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబీ) మాజీ చీఫ్ ప్రభాకర్ రావు జూబ్లీహిల్స్ పోలీసు స్టేషన్‌లో సరెండర్ అయ్యారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఆయన సిట్ ఎదుట హాజరయ్యారు. దీంతో, ప్రభాకర్ రావును.. సిట్ అధికారులు విచారించనున్నారు. ఈ కేసులో కీలక విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉంది.

2లో



# మేడారంలో 8 ద్వారాలు..

◆ ప్రాకారాలు, నాలుగు గద్దెలు నిర్మిస్తున్నం: మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
◆ అమ్మవార్ల అనుగ్రహంతో వేగంగా పనులు
మహా జాతర నాటికి అధునాతన వసతులు

**హైదరాబాద్/**
మేడారంలో శాశ్వతపనులు శరవేగంగా సాగుతున్నాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. 8 ద్వారాలు, ప్రాకారాలు, నాలుగు గద్దెలను నిర్మిస్తున్నట్టు చెప్పారు.



మిగతాది 2లో

## అల్లూరి జిల్లాలో
# ఘోర బస్సు ప్రమాదం

◆ లోయలో పడ్డ బస్సు.. పదిమంది దుర్మరణం
◆ చింతూరు ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు
◆ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు

**అల్లూరిజిల్లా,డిసెంబర్12 :**
అల్లూరి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర ప్రమాదం జరిగింది. చిత్తూరు జిల్లాకు చెందిన ఓ ప్రైవేటు బస్సు అదుపు తప్పి లోయలో పడింది. ఈ ప్రమాదంలో పదిమంది వరకు మృతి చెందినట్లు సమాచారం. చింతూరు నుంచి మారేడుమిల్లి వెళుతున్న బస్సు ఘాట్‌రోడ్డు వద్ద అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఘటనాస్థలి వద్ద ప్రయాణికులు హాహాకారాలు మిన్నంటాయి.



మిగతాది 2లో

# అంధుల మహిళా క్రికెటర్లకు పవన్ అభినందనలు

» ఒక్కొక్కరికి 5లక్షల చొప్పున చెక్కుల అందచేత
» శిక్షకులకు 2లక్షల చొప్పున చెక్కులు పంపిణీ

**అమరావతి,డిసెంబర్12:**
ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారత మహిళల అంధుల క్రికెట్ జట్టుతో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. మహిళా అంధ క్రికెటర్లు సాధించిన విజయం దేశానికే గర్వకారణమన్నారు. శుక్రవారం మంగళగిరిలోని క్యాంపు కార్యాలయంలో క్రికెటర్లు, శిక్షకులు, సహాయక సిబ్బందితో డిప్యూటీ సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రపంచ కప్ సాధించిన క్రికెటర్లను అభినందించిన పవన్..



# పంచాయితీ ఫలితాలతో కాంగ్రెస్ పతనం

» 44శాతం సీట్లను కూడా గెల్చుకోలేని అధికార పార్టీ
» వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయానికి నాంది
» పంచాయితీ ఫలితాలపై ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,డిసెంబర్12**
పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ పట్ల ప్రజల్లో వ్యతిరేకత స్పష్టమయ్యిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.



2లో..

# మధ్యాహ్న భోజనం తిన్న 44 మంది విద్యార్థులకు అస్వస్థత

# నేడు మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్

» ఉప్పల్ స్టేడియం వద్ద భారీ బందోబస్తు » పాస్‌లు ఉన్నవారే రావాలన్న కమిషనర్

**హైదరాబాద్,డిసెంబర్12**
ఉప్పల్ స్టేడియంలో శనివారం జరగబోయే అంతర్జాతీయ ఫుట్‌బాల్ ఈవెంట్ కోసం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు వెల్లడించారు. ఈవెంట్‌కు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. మెస్సీకి జి కేటగిరీ భద్రత కల్పిస్తున్నామని, ఆయన్ని గ్రీన్ ఛానల్ ద్వారా స్టేడియంకు తీసుకువస్తామని సీపీ తెలిపారు. అయితే, వాహనంలో ఉన్నప్పుడు కూడా మెస్సీని చూసే అవకాశం ప్రేక్షకులకు ఉండదని, కాబట్టి అనవసరంగా రోడ్డుపైకి వచ్చి చూసే ప్రయత్నం చేయవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.



2లో..

# తప్పుడు ఆరోపణలు చేస్తే కాళ్లు విరగ్గొడుతా

మొదటిపేజీ తరువాయి

ఈ విషయం తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రి హరీష్ రావు, బీఎర్ఎస్ టార్గెట్‌గా జాగృతి అధ్యక్షురాలు కవిత మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. హరీష్ రావు, కేటీఆర్, కేసీఆర్‌ను ఒక్క సహాయం కూడా అడగలేదని తెలిపారు. ఉద్యమంలో ఎవరు ఏమి చేశారనేది తాను ఎప్పుడూ చెప్పలేదన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావుతో హరీష్, బీఆర్ఎస్ తనపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతల అక్రమాలు తన దృష్టికి వస్తున్నాయని... అసలు కథ ముందుంది అంటూ కామెంట్స్ చేశారు. నేను మంచి దాన్ని కాదు. కాళ్ళు విరగొడతానంటూ హెచ్చరించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడారు. అధికారంలో ఉన్న పదేళ్లలో తాను, తన భర్త ఒక్క పని అయినా అడిగామా అని ప్రశ్నించారు. తాను ఏ తప్పూ చేయలేదని.. బీఆర్ఎస్‌లో 10 ఏళ్లలో ఒక్క రూపాయి సంపాదించ లేదని స్పష్టం చేశారు. ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు వారం రోజుల్లో క్షమాపణలు చెప్పాలని.. లేదంటే కోర్టుకి ఈడుస్తామని వార్నింగ్ ఇచ్చారు. తనను పార్టీ నుంచి పంపించారని.. అయినా వాళ్ల కళ్ళు చల్లబడలేదా అని వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ కిటికీలు తెరిచిందని.. కాంగ్రెస్ డోర్స్ ఓపెన్ చేసిందన్నారు. తనపై ఎవ్వరు ఎలాంటి ఆరోపణలు చేసినా జవాబు చెబుతానన్నారు. బీఆర్ఎస్ హయాంలో చాలా తప్పిదాలు జరిగాయని... అవి తన దృష్టికి వస్తున్నాయని తెలిపారు. బీఆర్ఎస్ వాళ్ళు తప్పు చేశారనే.. రేవంత్ అధికారంలోకి వచ్చారని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన లావాదేవీలకు, కాంగ్రెస్‌కు సంబంధం ఉందని ఆరోపించారు. 'నేను ఏదో ఒక రోజు ముఖ్యమంత్రి అవుతా. హరీష్ రావు.. విజ్ఞత అని తప్పించుకుంటున్నారు. లైన్‌లు నేను దాట లేదు. నేను ఇంకా ఊరుకోను ' అంటూ కవిత సంచలన కామెంట్స్ చేశారు. కాంగ్రెస్‌తో అంటకాగుతున్నట్లు తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. వెకిలి చేష్టలు చేస్తున్న గుంట నక్కలూ.. జాగ్రత్త అని ఆమె హెచ్చరించారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందించారు. 'కేసీఆర్‌తో పాటు ఎవరినైనా ఒక్క పనైనా అడిగామా? దమ్ముంటే నా ఆరోపణలకు సమాధానం ఇవ్వండి. నాకు ఎవరితోనూ అవగాహన లేదు.. వ్యాపారాలు లేవు. మాధవరం కృష్ణారావుకు నోటీసులు పంపుతున్నా. వారంలో క్షమాపణ చెప్పకపోతే కోర్టుకు ఈడుస్తాను. ఏవీరెడ్డితో పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డికి భూలావాదేవీలు ఉన్నాయి. శ్రీనివాస్‌రెడ్డి నిరంతరం కేటీఆర్ వద్ద ఉంటారు. ఆయన ఎవరి బినామీనో చెప్పాలి. మాధవరం కృష్ణారావు చాలా చిన్న వ్యక్తి. ఓ గుంట నక్క ఆయన వెనక ఉండి ఆడిస్తోంది. కృష్ణారావు బాధితులు చాలామంది నాకు ఫోన్లు చేస్తున్నారు. ప్రణీత్, ప్రణవ్ కంపెనీల్లో కృష్ణారావు కుమారుడు డైరెక్టర్. ఆ కంపెనీల విల్లాలన్నీ కబ్జాల్లో కట్టినవే. వెంచర్ మధ్యలోని 10 ఎకరాల చెరువు 6 ఎకరాలకు ఎలా తగ్గింది అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, హైడ్రా ఆ చెరువు సంగతి చూడాలి. కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో అభివృద్ధి పేరిట చెరువునే మింగేశారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనతో నాకు సంబంధం లేదు. ఎంపీగా ఉన్నప్పుడు దిల్లీ, నిజామాబాద్‌కే పరిమితమయ్యా. పార్టీ నుంచి వెళ్లగొట్టారు కదా.. ఇంకా కళ్లు చల్లబడలేదా? హిల్ట్ పాలసీకి బీఆర్ఎస్ కిటికీలు తెరిస్తే.. కాంగ్రెస్ ద్వారాలు తెరుస్తోంది. నాతో పాటు నా భర్తపై బీఆర్ఎస్ విష ప్రచారం చేస్తోంది. గత ప్రభుత్వంలో చాలా తప్పిదాలు జరిగాయి. దేవుడి దయతో నేను ముఖ్యమంత్రి అవుతాను. 2014 నుంచి జరిగిన అన్ని అన్యాయాలను వెలికితీస్తాను అని కవిత వ్యాఖ్యానించారు. తెలంగాణ జాగృతి జనం బాట పేరిట కవిత విస్తృతంగా పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ప్రజా సమస్యల పరిష్కారం కోసమే జనం బాట చేపట్టినట్లు కవిత ప్రకటించారు. మొదటగా ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో జనం బాట కార్యక్రమం చేపట్టిన కవిత ఇప్పుడు మేడ్చల్, హైదరాబాద్ జిల్లాలో పర్యటిస్తున్నారు. గురువారం నగరంలోని మలక్‌పేట, యాకుత్‌పురా, చాంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో పర్యటించారు కవిత. స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను కవిత తెలుసుకుంటున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ నేతలపై సంచలన వ్యాఖ్యలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుపై షాకింగ్ కామెంట్స్ చేశారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు మాధవరం కృష్ణారావు కూడా కౌంటర్ ఇచ్చారు. ఈ నేపథ్యంలోనే ఆయనకు కవిత నోటీసులు పంపించినట్లు సమాచారం.

# ఫోన్ ట్యాపింగ్ కేసు..
# సిట్ ఎదుట ప్రభాకర్ రావు సరెండర్

మొదటిపేజీ తరువాయి

కాగా, ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టులో గురువారం గట్టి ఎదురుదెబ్బ తగిలిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆయనను అరెస్టు చేయకుండా గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టు సవరించింది. తక్షణమే ఆయన విచారణాధికారుల ఎదుట లొంగిపోవాలని, కస్టోడియల్ విచారణకు సహకరించాలని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌తో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో సిట్ ఎదుట హాజరుకావాలని స్పష్టం చేసింది. కస్టడీ సమయంలో ఆయనపై ఎలాంటి థర్డ్ డిగ్రీ ప్రయోగించరాదని, శారీరక హింసకు గురిచేయకూడదని చెప్పింది. ఆయన వయసును దృష్టిలో ఉంచుకుని గౌరవంగా వ్యవహరించాలని సూచించింది. ఇంటి నుంచే భోజనం అందించాలని ఆదేశాల్లో తెలిపింది. అనంతరం, తదుపరి విచారణను డిసెంబర్ 19కి వాయిదా వేసింది.

### 'క్రిమినల్స్ మధ్య 30 ఏళ్లు పనిచేశారు.. జాగ్రత్త!'

విచారణ సందర్భంగా ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఆయన 30 ఏళ్ల పాటు పోలీసు శాఖలో పనిచేశారు. ఎంతోమంది నేరస్తులను డీల్ చేసి ఉంటారు. కాబట్టి కస్టడీలో ఆయనకు ఎలాంటి శారీరక హాని కలగకుండా చూడాల్సిన బాధ్యత మీదే' అని పోలీసుల తరఫు న్యాయవాదికి సూచించింది. అయితే, ఆయనకు ప్రత్యేకంగా వీఐపీ ట్రీట్‌మెంట్ ఇవ్వలేమని, చట్టం అందరికీ సమానమేనని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పష్టం చేశారు.

### ఆధారాలు ధ్వంసం చేశారు..

అంతకుముందు.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ ప్రభాకర్ రావు అధికార దుర్వినియోగానికి పాల్పడటమే కాకుండా, సాక్ష్యాధారాలను పకడ్బందీగా ధ్వంసం చేశారని చెప్పారు. 2023 నవంబర్ 29న ఎన్నికలకు సరిగ్గా ఒకరోజు ముందు ప్రభాకర్ రావు సంతకంతో 50 కొత్త హార్డ్ డిస్క్‌లను కొనుగోలు చేశారని తెలిపారు. 30న అసెంబ్లీ ఎన్నికలు జరిగాయని, డిసెంబర్ 2న రికార్డులన్నింటినీ ధ్వంసం చేయాలని ప్రభాకర్ రావు ఆదేశించారని చెప్పారు. డిసెంబర్ 4న ఫలితాలు వచ్చిన వెంటనే ప్రభాకర్ రావు రాజీనామా చేశారని, వెళ్లేముందు కంప్యూటర్ల నుంచి 50 పాత హార్డ్‌డిస్క్‌లను తీయించి, వాటిని కట్టర్లతో కోయించి నదిలో పారేయించారన్నారు. 'ఆయన చాలా తెలివైన అధికారి.. ఆధారాలు లేకుండా చేశారు' అని వ్యాఖ్యానించారు. ప్రభాకర్ రావు ఏమాత్రం సహకరించడం లేదని సిట్ తరఫు సీనియర్ న్యాయవాదులు సిద్ధార్థ్ లూథ్రా చెప్పారు.

### కాలర్ పట్టుకుని ఈడ్చుకెళ్తామన్నారు

ప్రభాకర్ రావు తరఫున సీనియర్ న్యాయవాది రంజిత్ కుమార్ వాదనలు వినిపిస్తూ.. ఇది పూర్తిగా రాజకీయ కక్షసాధింపు చర్య అని పేర్కొన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి (అప్పుడు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు) 2021లో చేసిన ప్రసంగాన్ని ఆయన కోర్టులో చదివి వినిపించారు. 'ప్రభాకర్ రావు.. రిటైర్ అయ్యాక ఇంట్లో ఉన్నా సరే, హోంగార్డును పంపి కాలర్ పట్టుకుని ఈడ్చుకొస్తాం' అని రేవంత్ రెడ్డి హెచ్చరించారని, ఇప్పుడు ఆ పగ తీర్చుకుంటున్నారని రంజిత్ కుమార్ వాదించారు. ఆయనకు ఆరోగ్యం బాగాలేదని ఇంటి భోజనానికి, మందులకు అనుమతించాలని కోరడంతో కోర్టు అనుమతి ఇచ్చింది.

# ఫ్యూచర్ సిటీ, మూసీ పునర్జీవం, వ్యవసాయాధారిత రంగాలు

మొదటిపేజీ తరువాయి

డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కలిసి జర్మనీ పార్లమెంట్ ప్రతినిధి బృందంతో విస్తృతంగా చర్చలు జరిపారు. రెండు దేశాల మధ్య ఐటీ, డిఫెన్స్, ఫార్మా, మెటలర్జీ, స్కిల్ డెవలప్‌మెంట్ వంటి కీలక రంగాల్లో సంయుక్త భాగస్వామ్యానికి మార్గాలు అన్వేషించడంపై ఈ సమావేశం దృష్టి సారించింది. ఈ సమావేశంలో మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, జర్మనీతో తెలంగాణకు ఉన్న సుదీర్ఘ స్నేహ బంధాన్ని గుర్తుచేశారు. తెలంగాణ యువతను జర్మనీ పరిశ్రమలకు అనుసంధానించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. స్కిల్ యూనివర్సిటీలో ప్రత్యేకంగా జర్మన్ లాంగ్వేజ్ విభాగాన్ని ఏర్పాటు చేస్తే, జర్మనీలో ఉన్న ఉపాధి అవకాశాలు తెలంగాణ విద్యార్థులకు మరింత చేరువవుతాయని వివరించారు. సైబర్ సెక్యూరిటీ రంగంలో తెలంగాణ ఇప్పటికే ముందు వరుసలో ఉందని మంత్రి శ్రీధర్ బాబు జర్మన్ బృందానికి వివరించారు. హైదరాబాద్ సైబర్ ఎక్సలెన్స్ సెంటర్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక యూనిట్లు, జిల్లాల స్థాయిలో ఏర్పాటు చేస్తున్న సైబర్ సెక్యూరిటీ వింగ్స్, ఆర్థిక నేరాలను ఎదుర్కొనే ఆధునిక ౦ఎ టూల్స్?జ్గీ÷ ఈ చర్యలు తెలంగాణను దేశంలోనే అత్యాధునిక సైబర్ సెక్యూరిటీ హబ్‌గా నిలిపాయని పేర్కొన్నారు. ఈ రంగంలో జర్మనీ భాగస్వామ్యం రాష్ట్రాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు తీసుకెళ్తుందని ఆయన తెలిపారు. సమావేశంలో పాల్గొన్న జర్మన్ పార్లమెంట్ సభ్యులు, తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన 'తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్'ను ప్రత్యేకంగా ప్రశంసించారు. రాష్ట్ర అభివృద్ధికి సంబంధించి ప్రతి రంగంలో స్పష్టమైన లక్ష్యాలు, నిర్మాణాత్మక ప్రణాళికలు ఉండటం అభినందనీయమని అభిప్రాయపడ్డారు. సైబర్ సెక్యూరిటీ, స్కిల్డ్ లేబర్ ఎక్స్ఛేంజ్, విద్య, పరిశ్రమల రంగాలలో తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ఆసక్తి వ్యక్తం చేశారు. జర్మన్ ప్రతినిధులు మాట్లాడుతూ, ఇప్పటికే భారతదేశంలో జర్మనీ పెట్టుబడులు భారీ స్థాయిలో ఉన్నాయని, ముఖ్యంగా బోష్ వంటి మెగా కంపెనీలు తెలంగాణలో తమ కార్యకలాపాలను మరింత విస్తరించేందుకు ఆసక్తి కనబరుస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం జర్మనీలో 60,000 మంది భారతీయ విద్యార్థులు చదువుతున్నారని, తెలంగాణ యువత ప్రతిభ అంతర్జాతీయంగా అత్యంత గుర్తింపు పొందుతోందని వ్యాఖ్యానించారు. ఎనిమిది మంది జర్మన్ పార్లమెంట్ సభ్యులతో పాటు సీనియర్ అధికారులు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నారు. తెలంగాణ తరపున ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఇందన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ట్రాన్స్కో సీఎండీ కృష్ణభాస్కర్, జెన్‌కో సీఎండీ హరీష్, ప్రణాళిక శాఖ సెక్రటరీ బుద్ధప్రకాశ్ జ్యోతి తదితర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# పంచాయితీ ఫలితాలతో కాంగ్రెస్ పతనం

మొదటిపేజీ తరువాయి

ఈ ఎన్నికల్లో పోటీ చేసిన చోట కనీసం 44 శాతం సీట్లను కాంగ్రెస్ పార్టీ దాటకపోవడం.. ప్రభుత్వంపై పెరిగిన ప్రజావ్యతిరేకతకు నిలువెత్తు నిదర్శమన్నారు. ఈ మేరకు తొలి విడత పంచాయతీ ఎన్నికల ఫలితాలపై కేటీఆర్ శుక్రవారం తన ఎక్స్ ఖాతా వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. పంచాయతీ ఎన్నికలు అధికార పార్టీకి కొంత అనుకూలంగా ఉంటాయని తొలుత ప్రచారం జరిగిందని తెలిపారు. కానీ రేవంత్ పరిపాలనా వైఫల్యంపై ప్రజలు పూర్తిగా విసిగిపోయారని ఈ ఎన్నికల ఫలితాల ద్వారా రుజువైందని స్పష్టం చేశారు. పంచాయతీ ఎన్నికలతో మొదలైన కాంగ్రెస్ పతనం రానున్న రోజుల్లో పాతాళానికి పడిపోవడం ఖాయమని జోస్యం చెప్పారు. ఆదిలాబాద్ నుంచి అలంపూర్ వరకూ వచ్చే ప్రతి ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం తథ్యమని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు.

తొలి విడత పంచాయతీ పోరులో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని దౌర్జన్యాలు చేసినా.. బీఆర్ఎస్ పార్టీ మద్దతుదారులు హోరాహోరీగా పోరాడి.. సర్పంచులు, వార్డు మెంబర్లుగా గెలిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ హత్యా రాజకీయాలకు పాల్పడినా మొక్కవోని ధైర్యంతో అధికార పార్టీ అరాచక పర్వాన్ని ఎదుర్కొన్నారంటూ వారిని ప్రశంసించారు. ఈ సందర్భంగా గులాబీ సైనికులందరికీ ఆయన ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. పంచాయతీ ఎన్నికల కోసం సాక్షాత్తూ ముఖ్యమంత్రే జిల్లాల్లో పర్యటించి ప్రచారం చేశారని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఇక ప్రత్యామ్నాయం కేవలం బీఆర్ఎస్ పార్టీ మాత్రమేనని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీకి స్థానం లేదని తొలిదశ పంచాయతీ ఫలితాల ద్వారా స్పష్టమైందన్నారు. రానున్న మూడేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నా.. పల్లెల్లో పైసా అభివృద్ధి పని జరగదని గ్రామస్తులు ఒక నిర్ధారణకు వచ్చేశారని చెప్పారు. అందువల్లే పంచాయతీ ఎన్నికల్లో అధికార పార్టీకి ఇంతటి ప్రతికూల ఫలితాలు ఎదురయ్యాయని వివరించారు. సగం స్థానాలు కూడా కాంగ్రెస్ గెలవకపోవడం.. పలు ప్రాంతాల్లో 10, 20 ఓట్ల తేడాతోనే బయటపడటం చూస్తే కాంగ్రెస్‌కు కౌంట్ డౌన్ పల్లెల నుంచే ప్రారంభమైందని స్పష్టంగా అర్థమవు తుందన్నారు. రెండేళ్లు గడిచినా ఆరు గ్యారెంటీల పేరిట.. పెన్షన్ల పెంపు, మహాలక్ష్మి, తులం బంగారం హామీ పేరిట చేసిన నయవంచనను గ్రామీణ ప్రాంత ప్రజలు ఇంకా మరిచిపోలేదని తెలిపారు. ఈ విషయాన్ని పంచాయతీ ఎన్నికల ఫలితాలు తేల్చి చెప్పాయన్నారు. యూరియా బస్తాల కోసం నెలల తరబడి పడిన అగచాట్లు, బోనస్ పేరిట చేసిన బోగస్ హామీ, చివరికి పండించిన పంటను అమ్ముకో లేక పడ్డ కష్టాలను అన్నదాతలు గుర్తు పెట్టుకున్నారని ఈ ఫలితాలు రుజువు చేశాయన్నారు. ఐదేళ్లపాటు ప్రగతిపథంలో సాగిన పల్లెల్లో.. గత రెండేళ్లుగా పాలన పడకేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. గాడి తప్పిన పారిశుధ్యం, చివరికి ట్రాక్టర్లలో డిజిల్ పోయలేని దుస్థితి పల్లె ప్రజలను ఆలోచింప జేసినట్టు ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయన్నారు. ఇది ఆరంభం మాత్రమే అని స్పష్టం చేశారు.

# అల్లూరి జిల్లాలో ఘోర బస్సు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి

సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులతో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో నిండుగా ప్రయాణికులున్నారు. భద్రాచలంలో ఆలయ దర్శనం చేసుకొని అన్నవరానికి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు స్థానికుల సాయంతో మృతదేహాలను బస్సు నుంచి వెలికితీశారు. గాయపడిన వారిని వెంటనే చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. 3 అంబులెన్సులు, 5 పోలీసు వాహనాలతో సహాయక చర్యలను ముమ్మరం చేశారు. ఈ బస్సు ప్రమాదం కారణంగా ఆ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అనేక వాహనాలు ఘాట్ రోడ్డులో నిలిచిపోయినట్టు సమాచారం. ప్రమాదానికి గురైన వారందరు చిత్తూరు జిల్లావాసులని అధికారులు వెల్లడించారు. ప్రయాణికుల్లో దాదాపు అందరు వృద్ధులు అని వివరించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం జరిగిన సమయంలో 30 మంది బస్సులో ఉన్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం తులసిపాకలు ఘాట్ రోడ్‌లో చోటుచేసుకున్న బస్సు ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భద్రాచలం నుంచి అన్నవరం వెళుతున్న ప్రైవేటు బస్సు లోయలో పడిన ఘటనలో పలువురు మృతి చెందడంపై సీఎం చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు. బస్సు ప్రమాదం, క్షతగాత్రులకు అందుతున్న సాయంపై అధికారులతో మాట్లాడారు. బస్సులో మొత్తం 35 మంది ప్రయాణీకులు ఉన్నారని, పలువురు మృతి చెందగా గాయపడిన వారిని చింతూరు ఆసుపత్రికి తరలించామని అధికారులు ముఖ్యమంత్రి తెలియజేశారు.ద్రాచలం సమీపంలో తులసిపాక వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం పట్ల సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు దిగ్భాం÷–రతి వ్యక్తం చేశారు. మరణించినవారికి తీవ్ర సంతాపం ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధితులకు అండగా సిపిఎం అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందించాలని స్థానిక నాయకత్వాన్ని, కార్యకర్తలను కోరారు. ప్రభుత్వం తక్షణం సహాయం అందించి క్షతగాత్రులను, బాధిత కుటుంబాలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# అంధుల మహిళా క్రికెటర్లకు పవన్ అభినందనలు

మొదటిపేజీ తరువాయి

ఒక్కో క్రికెటర్‌కు రూ.5 లక్షల చొప్పున, శిక్షకులకు రూ.2 లక్షలు చొప్పున చెక్కులు అందించారు. ప్రతి మహిళా క్రికెటర్‌కు పట్టు చీర, శాలువాతో పాటు జ్ఞాపిక, కొండపల్లి బొమ్మలు, అరకు కాఫీతో కూడిన బహుమతులను అందించి సత్కరించారు. అనంతరం డిప్యూటీ సీఎం పవన్ మాట్లాడుతూ.. అంధ క్రికెటర్ల ప్రాక్టీస్ కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించాలని.. అన్ని విధాలా అండగా నిలవాలని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. మహిళా క్రికెటర్లు తెలిపిన అంశాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ప్రపంచ కప్ గెలిచిన జట్టులో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణులు దీపిక (జట్టు కెప్టన్), పాంగి కరుణా కుమారి ఉండటం సంతోషంగా ఉందని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఇక ఈ సమావేశంలో భాగంగా జట్టు కెప్టన్ దీపిక తమ గ్రామ సమస్యలను ఉపముఖ్యమంత్రికి దృష్టికి తీసుకెళ్లారు. తమ గ్రామానికి రహదారి సౌకర్యం కావాలని దీపిక విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన పవన్.. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన క్రికెటర్ కరుణ కుమారి చేసిన విజ్ఞప్తులపైనా తక్షణమే చర్యలు ప్రారంభించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాలు జారీ చేశారు.

# నేడు మెస్సీ ఫుట్‌బాల్ మ్యాచ్

మొదటిపేజీ తరువాయి

స్టేడియం సామర్థ్యం 39 వేలు అని, దానికి తగ్గట్టుగానే నిర్వాహకులు పాస్‌లు అమ్ముతున్నారని, అయితే స్టేడియం దగ్గర ఎలాంటి పాస్‌లు అమ్మబడవని, కేవలం ఆన్‌లైన్ లోనే పాస్‌లు అమ్మబడతాయని క్లారిటీ ఇచ్చారు. పాసులు ఉన్నవారు మాత్రమే రావాలని, లేనివారు స్టేడియం వద్దకు రావద్దని స్పష్టం చేశారు సీపీ. భద్రత కోసం స్టేడియం పరిసరాల్లో 450 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, ప్రత్యేక కంట్రోల్ రూమ్ ద్వారా ఎప్పటికప్పుడు భద్రతను పర్యవేక్షిస్తామని తెలిపారు. అంతేకాకుండా, మోస్ట్ అడ్వాన్స్‌డ్ డ్రోన్‌లతో కూడా నిఘా పెడుతున్నట్లు చెప్పారు. రేపు సాయంత్రం 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం అవుతుందని, సాయంత్రం 4 గంటల నుంచే ప్రేక్షకులను లోపలికి అనుమతిస్తామని సీపీ పేర్కొన్నారు. మెస్సీ కొద్దిసేపు మాత్రమే ఆడతారు కాబట్టి, ప్రేక్షకులు ముందస్తుగానే స్టేడియం చేరుకోవాలని సూచించారు. భద్రతా కారణాల దృష్ట్యా, ల్యాప్ టాప్‌లు, బ్యానర్లు, వాటర్ బాటిళ్లు, కెమెరాలు, సిగరెట్లు, గొడుగులు, లైటర్లు, బైనాకులర్లు, బ్యాటరీలు, షార్ప్ ఆ÷–జబెక్ట్స్, హెల్మెట్, బ్యాగ్ వంటి వస్తువులకు స్టేడియం లోపలికి అనుమతి లేదని, కేవలం మొబైల్ ఫోన్‌లను మాత్రమే అనుమతిస్తున్నట్లు సీపీ సుధీర్ బాబు తెలిపారు..

# మధ్యాహ్న భోజనం తిన్న 44 మంది విద్యార్థులకు అస్వస్థత

మొదటిపేజీ తరువాయి

మాదాపూర్ చందానాయక్ తండ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న 44 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. దీంతో విద్యార్థులను కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఆరుగురి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

### బాగ్‌లింగంపల్లిలో..

హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ అయిన ఏడుగురు విద్యార్థులు నిలోఫర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. రాత్రి భోజనం చేసిన విద్యార్థులు వాంతులు, విరోచనలు, కడుపునొప్పితో బాధపడుతున్నారని, వెంటనే వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించామని గురుకుల పాఠశాల సిబ్బంది తెలిపారు. పిల్లల ఆరోగ్య ప్రస్తుతం నిలకడగానే ఉందని నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ విజయ్ కుమార్ తెలిపారు.

# మేడారంలో 8 ద్వారాలు..

మొదటిపేజీ తరువాయి

డబ్బులకు వెనకాడకుండా శాశ్వత నిర్మాణ పనులు చేస్తున్నామన్నారు. ఇవాళ మేడారంలో మంత్రి సీతక్కతో కలిసి పర్యటించా రు. పనులు పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. జాతర ప్రాంతంలోనే కాకుండా పరిసర ప్రాంతాల్లో కూడా అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు.

అంతకు ముందు గద్దెల వద్ద జరుగుతున్న పనులు పరిశీలించారు. ఏ అధికారి ఏ పని చేస్తున్నారో అర్థం కావడం లేదు.. పనులు సక్రమంగా చేయకుండా నిర్ల క్ష్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న పాలరాతి శిల్పాలను పరిశీలించి సకాలంలో పూర్తవు వుతాయా..? అంటూ అనుమానం వ్యక్తం చేశారు. 24 గంటల పాటు పనులు కొనసా గించి, సకాలంలో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మంత్రుల వెంట ముఖ్యమంత్రి పర్సనల్ సెక్రటరీ శ్రీనివాసరాజు తదితరులు ఉన్నారు.

## మల్లాపూర్ లో రెండో బిసి సర్పంచ్
### - చిట్యాల లక్ష్మణ్ ఘన విజయం



**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
మల్లాపూర్ లో రెండో బిసి సర్పంచ్ గా చిట్యాల లక్ష్మణ్ ఘన విజయం జగిత్యాల జిల్లా, కోరుట్ల మండలం మల్లాపూర్ మేజర్ గ్రామ పంచాయతీలో రెండో బిసి సర్పంచ్ గా చిట్యాల లక్ష్మణ్ 263 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. గతంలో వేలంపాట కారణంగా ఎన్నిక రద్దు కావడంతో ఏడేళ్లుగా సర్పంచ్ లేని గ్రామానికి ఆయన ఎన్నికయ్యారు. బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల నినాదంతో బరిలోకి దిగిన లక్ష్మణ్ విజయం సాధించారు. అంతకుముందు కీ.శే. ముద్దం లక్ష్మినారాయణ మొదటి బీసీ సర్పంచ్ గా ఎన్నికయ్యారు.

## దమ్ముంటే అభివృద్ధి చేసి ప్రజల ప్రేమను పొందాలి



**పతి, కరపత్రం భూపాలపల్లి ప్రతినిధి**
భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మీరు వేసే ప్రతి ఓటు కాంగ్రెస్ ప్రభుత్వాన్నికి సురుకు పోట్లు పొడవాలని, ఓటు వేయకపోతే ఇందిరమ్మ ఇళ్లు, రోడ్లు, అభివృద్ధి రావని ఎమ్మెల్యే బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. దమ్ముంటే అభివృద్ధి చేసి ప్రజల ప్రేమను పొందాలని ఆయన అన్నారు.

## భూపాలపల్లి లో పోలింగ్ ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్



**పతి, కరపత్రం భూపాలపల్లి, ప్రతినిధి**
భూపాలపల్లి జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ గణపురం మండలం గాంధీనగర్‌లోని సిఎస్ఐ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు లేవని, పోలింగ్ ప్రక్రియ సజావుగా సాగుతోందని తెలిపారు. మొదటి విడతలో గణపురం, రేగొండ, కొత్తపల్లి గోరి, మొగుళ్లపల్లి మండలాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగినట్లు ఆయన పేర్కొన్నారు.

## భూపాలపల్లి జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు: ఎస్పీ



**పతి, కరపత్రం, భూపాలపల్లి, ప్రతినిధి,**
భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో తొలి విడత బసవరాజుపల్లి మరియు పరశురాంపల్లి గ్రామపంచాయతీ ఎన్నికల సరళిని ఎస్పీ సంకీర్త్ పరిశీలించారు. మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని పోలీసు బృందాలు అప్రమత్తంగా పనిచేశాయని, ప్రజలు స్వేచ్ఛగా, భయభ్రాంతులకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, జిల్లాలో ప్రశాంతంగా మొదటి విడత ఎన్నికలు ముగిశాయని తెలిపారు.

## గుండంపల్లిలో బీజేపీ అభ్యర్థి ఘన విజయం



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
గుండంపల్లిలో బిజెపి అభ్యర్థి 25 ఓట్లతో ఘన విజయం జగిత్యాల జిల్లా, కోరుట్ల మండలం గుండంపల్లి గ్రామంలో జరిగిన ఎన్నికలలో బీజేపీ అభ్యర్థి పాల్తేపు గంగారెడ్డి 25 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఆరో వార్డులో బీజేపీ అభ్యర్థిపై కాంగ్రెస్, టీఆర్ఎస్, స్వతంత్ర అభ్యర్థులు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గంగారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## మేడ్చల్ లో క్యాన్సర్ అవగాహన శిబిరం నిర్వహణ

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ లో క్యాన్సర్ అవగాహన శిబిరం నిర్వహణ సుప్రభాత్ టౌన్‌షిప్ వెంచర్-1 కమ్యూనిటీ హాల్, కొర్రెముల-పోచారం వద్ద దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ రెనోవా హాస్పిటల్ ఆధ్వర్యంలో క్యాన్సర్ అవగాహన శిబిరం నిర్వహించబడుతుంది. ఈ శిబిరం సోమవారం, 15 డిసెంబర్ 2025, ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్య నిపుణులు క్యాన్సర్ నివారణ, ప్రారంభ దశలో గుర్తించే విధానాలు, ఆరోగ్య సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించనున్నారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగ కుటుంబాలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రయోజనం పొందాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మరియు డీడీహెచ్ క్యాన్సర్ సెంటర్ అధికారులు శుక్రవారం తెలిపారు.

## మల్లాపూర్ PHC సందర్శించిన డిప్యూటీ DMHO జైపాల్ రెడ్డి



### - సిబ్బంది సన్మానం

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
డిప్యూటీ DMHO గా పదోన్నతి పొందిన జైపాల్ రెడ్డి మల్లాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ డాక్టర్ వాహిని, సిబ్బంది ఆయనకు ఘనంగా సన్మానం చేశారు. రోగులకు అందుతున్న సేవలు, ల్యాబ్, ఫార్మసీలను పరిశీలించి, ఆరోగ్య సూచికలను సమీక్షించారు. ఏఎన్ఎం లచ్చమ్మపై అందిన ఫిర్యాదుపై విచారణ కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి వాహిని రావు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## జెసిబి ఆపరేటర్ భార్య సర్పంచ్ గా విజయం



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
జెసిబి ఆపరేటర్ భార్య సర్పంచ్ గా విజయం జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం గుమ్లాపూర్ గ్రామంలో, పెద్దగా చదువుకోకపోయినా గ్రామ పరిస్థితులపై అవగాహన ఉన్న జెసిబి ఆపరేటర్ రావట్ల శ్రీకాంత్, తన భార్య స్రవంతితో నామినేషన్ వేయించి, ఆమెను సర్పంచ్‌గా గెలిపించి అందరినీ ఆశ్చర్యపరిచారు. సొంత సోదరుడు, పెద్దనాన్న కొడుకుపై విజయం సాధించడం విశేషం. గెలిచిన స్రవంతి మహిళా సాధికారతకు కృషి చేస్తూ, గ్రామ అభివృద్ధికి పాటుపడతానని, ఓటు వేసిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఒక సామాన్య మహిళ, జెసిబి ఆపరేటర్ భార్య సర్పంచ్‌గా గెలవడం ప్రజాస్వామ్య విలువలను, రాజ్యాంగం ఇచ్చిన హక్కులను కాపాడినట్లు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## విమాన టిక్కెట్ ధరలపై నియంత్రణ అసాధ్యం

### - నిరంతరాయంగా పరిమితి విధించడం సాధ్యం కాదు
### - లోక్‌సభలో మంత్రి రామ్మోహన్ నాయుడు

**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ,డిసెంబర్12**
విమానయాన రంగంలో ఏడాది పొడవునా టికెట్ ఛార్జీలపై నియంత్రణ సాధ్యం కాదని కేంద్రం తెలిపింది. అలాగే ధరలపై పరిమితి విధించడం కూడా అసాధ్యం అని పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. టికెట్ ధరల డీ-రెగ్యులేషన్ వల్ల వినియోగదారులకు కూడా ప్రయోజనకరమని చెప్పారు. పండగల సీజన్‌లో మాత్రం టికెట్ ధరలు పెరగడం సహజమని పేర్కొన్నారు. ఇండిగో సంక్షోభం నేపథ్యంలో విమాన టికెట్ ధరలను నియంత్రించాలంటూ
పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ప్రైవేట్ మెంబర్ బిల్లుపై శుక్రవారం రామ్మోహన్ నాయుడు మాట్లాడారు. టికెట్ ధరల డీ-రెగ్యులేషన్ వల్ల పౌరవిమానయాన రంగం వృద్ధి చెందుతుందని చెప్పారు. అప్పుడే కొత్త ప్లేయర్లు ఈ రంగంలోకి ప్రవేశించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. అలాగని కంపెనీలు ఇష్టమొచ్చినట్లుగా ధరలు పెంచుకుంటామంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని స్పష్టంచేశారు. అవసరమైన సమయాల్లో జోక్యం చేసుకునే అధికారం ప్రభుత్వానికి ఉందన్నారు. కంపెనీలు తమకు దఖలు పడిన అధికారాన్ని దుర్వినియోగం చేసిన సందర్భాల్లో ప్రభుత్వం జోక్యం చేసుకున్న ఉదంతాలనూ ఈ సందర్భంగా ప్రస్తావించారు. కొవిడ్, కుంభమేళా, పహల్గాం ఉగ్రదాడి సమయాల్లో విమాన టికెట్ ధరలు అసాధారణంగా పెరిగినప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకుందన్నారు. అలాంటి సందర్భాల్లో ప్రభుత్వం తన ప్రత్యేక అధికారాలను వినియోగించి టికెట్ ధరలను అదుపు చేసిందని తెలిపారు. ఇటీవల ఇండిగో సంక్షోభ సమయంలోనూ టికెట్ ధరలను నియంత్రించిన సంగతిని పార్లమెంట్‌కు తెలియజేశారు. ఈశాన్య, దక్షిణాదిలోని 25 రూట్లలో టికెట్ల ధరలను స్థిరంగా ఉంచేందుకు 'ఫేర్ సే ఫుర్సత్' స్కీమ్‌ను తీసుకొచ్చినట్లు చెప్పారు. ఏవియేషన్ ఎకోసిస్టమ్ అభివృద్ధికి దీర్ఘకాలిక దృష్టితో ప్రభుత్వం చూడాల్సి ఉంటుందని, అంతే తప్ప కేవలం ఛార్జీలపై పరిమితి ఒక్కటే పరిష్కారం కాదని చెప్పారు. ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే దేశంలో విమాన టికెట్ ధరలు తగ్గుముఖం పట్టాయని చెప్పారు.

## హంసిని-ధార్మిక స్కూల్‌లో సైన్స్ ఫెయిర్





**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ పట్టణంలోని హంసిని, ధార్మిక స్కూల్లో శుక్రవారం విద్యార్థులు సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. వినూత్న ఆలోచనలతో దాదాపు 200 ప్రాజెక్టులు తయారు చేసి విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రతి స్టాల్ వద్ద విద్యార్థుల ఉత్సాహం, శోధనా తపన స్పష్టంగా కనిపించింది. సైన్స్ ఫెయిర్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ విద్యార్థులు రూపొందించిన మోడళ్లను ఆసక్తిగా పరిశీలించారు. వారిలో ఉన్న సృజనాత్మకతను ప్రశంసిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను అందుకోవాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులే న్యాయనిర్ణేతలుగా వ్యవహరించడం ఈ సైన్స్ ఫెయిర్‌కు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పిల్లల ప్రతిభను ప్రత్యక్షంగా చూసి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమాన్ని స్కూల్ కరస్పాండెంట్ నరాల సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహేందర్ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించిన గ్రామస్తులు

### - కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబం



**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజ్ పల్లె గ్రామానికి చెందిన వనపర్తి మహేందర్ అకాల మరణాన్ని చింతిస్తూ అతని కూతురు పేరుపై రెండు లక్షల రూపాయల ఫిక్స్ డ్ బాండ్ ను మహేందర్ పదవ తరగతి మిత్రులు, సుభాష్, రెడ్డి యూత్ క్లబ్ సభ్యులు సింగపూర్ మిత్రమండలి బృందం శుక్రవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. 2 లక్షల రూపాయల ఫిక్స్ డ్ బాండ్ ను అందించిన గ్రామస్తులకు మహేందర్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గుడిసె సదానందం, మాజి ఉప సర్పంచ్ నల్ల సతీష్ రెడ్డి, సుభాష్ యూత్ అధ్యక్షులు విక్కుర్తి సాయి, అయిత వెంకన్న, కొట్టాల కార్తీక్, మిట్టపెల్లి సునీల్, సుదవేని నరేష్, బూర శివ, బండి అనిల్, తదితరులున్నారు.

## కిక్ బాక్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ






**కరపత్రం ప్రతినిధి-హుజురాబాద్:**
హుజురాబాద్ పట్టణంలోని శ్రీ చైతన్య కరికులం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ కాకతీయ పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన తెలంగాణ కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ 2025-26 పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్ల సందీప్ కుమార్ మరియు కిక్ బాక్సింగ్ కోచ్ సాంబశివ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ ఛాంపియన్షిప్ పోటీలలో మన పాఠశాల విద్యార్థులు బెజ్జంకి ఈశ్వర్, గన్నారపు కార్తీక్, సాయి క్రిష్, జాతిన్ తేజ్, అన్వేష్ రెడ్డి, స్మితిక లు పాల్గొని సిల్వర్ మెడల్స్, బ్రాంజ్ మెడల్స్ తో పాటు సర్టిఫికెట్స్ సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వీరిని పాఠశాల ప్రిన్సిపల్ మరియు డీన్ ఇతర ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించారు.

## కాంగ్రెస్ నాయకుడు పాగె రాజయ్య బీఆర్ఎస్ పార్టీలో చేరిక

**కరపత్రం ప్రతినిధి డిసెంబర్ 12:**



మహాముత్తారం మండలం స్తంభంపల్లి పీపీ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పాగె రాజయ్య బీఆర్ఎస్ పార్టీలో చేరారు మంథని పట్టణంలోని రాజగృహ లో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సమక్షంలో బిఆర్ఎస్ లో చేరారు ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ వారికి బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు వారి వెంట పలువురు పాల్గొన్నారు.

## ఓ.సి.ఏం.1 గనిని తనిఖీ చేసిన రక్షణ కమిటీ బృందం



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని డిసెంబర్ 12:**
56వ రక్షణ పక్షోత్సవాలలో భాగంగా ఆర్.జి.3 ఏరియా ఓ.సి.ఏం.1 గనిని శుక్రవారం సి.హెచ్. వెంకట రమణ జిఏం (ఆర్ అండ్ డి) నేతృత్వంలోని రక్షణ కమిటీ బృందం గనిని తనిఖీ చేసింది. ఈ సందర్భంగా గని పై జరిగిన సమావేశానికి ఏరియా జనరల్ మేనేజర్ సుధాకర్ రావు ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ ఓ.సి.ఏం.1 గని అత్యుత్తమ ప్రమాణాలను నెలకొల్పిన గని అని, గత రెండు సంవత్సరాలుగా ఫైవ్ స్టార్ రేటింగ్ సాధిస్తూ ఉత్తమ అవార్డులు పొందుతుండడం కార్మికుల, అధికారుల సమన్వయానికి ఉదహరన అని ప్రశంశించారు. రక్షణ కమిటీ బృంద కన్వీనర్ వెంకటరమణ మాట్లాడుతూ ఓ.సి.ఏ.1 గనిని సింగరేణిలో ఉన్న అన్ని గంటలకు తల్లి లాంటిదని సింగరేణిలో అందరూ అనుకుంటారని, అమాదిరిగానే గని కార్మికులు,అధికారులు కఠినమైన అన్ని అడ్డంకులను అవలీలగా దాటుకుంటూ ఉత్తమ గనిగా తీర్చిద్దుకున్నారని, ఇదే సంస్కృతిని కొనసాగిస్తూ రక్షణతో పని చేయాలని కోరారు. అనంతరం గని కార్మీకులు రమేష్, రాధాకృష్ణ, రాజు,జెగదీశ్, రామస్వామి, చంద్రపాల్ బృందం ప్రదర్శించిన రక్షణ నాటిక "మన రక్షణ–మన బాధ్యత" ఆహుతులను అలరించగ రక్షణ కమిటీ కన్వీనర్ వెంకటరమణ కళాబృందాన్నీ అభినందించారు. ఈ కార్యక్రమంలో గని ప్రాజెక్ట్ అధికారి ప్రవీణ్ వి ఫాటింగ్, మేనేజర్ పాపయ్య, రక్షణ అధికారి అజయ్ కుమార్ లతోపాటు అధికారుల, కార్మిక సంఘాల నాయకులు ఏం.అర్.సి.రెడ్డి, డి.తిరుపతిరావు, జి.తిరుపతి, కొల శ్రీనివాస్, సాయి స్వరూప్ అధికారులు, కార్మికులు పాల్గొన్నారు.

## పదో తరగతి పరీక్షల షెడ్యూల్ సవరించాలి

- STU రాష్ట్ర అధనపు ప్రధానకార్యదర్శి సాన కిషన్



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 12**
ఇటీవల విడుదల చేసిన పదవ తరగతి పరీక్షలు షెడ్యూల్ 33 రోజుల పాటు సుదీర్ఘంగా ఉండడం ఇబ్బందికరం. పరీక్షల ఒత్తిడి, భయం,మానసిక ఆందోళనను విద్యార్థులు, తల్లిదండ్రులు , ఉపాధ్యాయులు నెలరోజులపాటు భరించడం ఆశాస్త్రీయమని, వెంటనే షెడ్యూల్ ను సవరించాలని STU రాష్ట్ర అధనపు ప్రధాన కార్యదర్శి సాన కిషన్, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు తిరుపతి రావు , శ్యామ్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పరీక్షల ఒత్తిడిని తొలగించాలని CCE అమలు చేస్తూ మరోవైపు సుదీర్ఘంగా పరీక్షల షెడ్యూల్ ఇవ్వడం సమంజసంగా లేదన్నారు. కేంద్ర సిలబస్ తో పోల్చుకున్నప్పుడు సౌకర్యాలు, వసతి,సిబ్బంది, తదితర అంశాలు ఆ స్థాయిలో ఉన్నప్పుడే విద్యార్థులు అలాంటి పరీక్షలకు సంసిద్దులుగా ఉంటారన్నారు. మండు వేసవిలో పాఠశాలల సమయాలు మారుస్తూ, సిబ్బందిని అటు పాఠశాలలకు, పరీక్షా కేంద్రాలకు తింపడం, మూల్యాంకన పత్రాలు, ప్రశ్నాపత్రాలను భద్రపరచడంలో ఇబ్బందులు ఉంటాయన్నారు. విద్యార్థి సెలవుల్లో చదవడానికి బదులు చదివింది మరచిపోవడానికి అవకాశం ఉంటుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను వదలకుండా నెలరోజులు ఉండడం కష్టసాధ్యమన్నారు. పదవ తరగతి పరీక్షల ప్రభావం మిగతా హెూం ఎగ్జామ్స్ పై, పోటీ పరీక్షలపై పడి అన్ని అలస్యమవుతాయని వెంటనే పూర్వరీతిగా మార్పు చేయాలని డిమాండ్ చేశారు.

## మానేరు విద్యార్థికి అంతర్జాతీయ ఫిడే రేటింగ్..




- 1503 రేటింగ్ సాధించిన లిఖిత్ చైతన్య
- అభినందించిన చైర్మన్ అనంతరెడ్డి

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 12**
కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థలకు చెందిన చదరంగ క్రీడాకారుడు ఈగ లిఖిత్ చైతన్య తన చెస్ కేరీర్‌లోనే అరుదైన ఘనతను సొంతం చేసుకున్నట్లు విద్యాసంస్థల పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. విజయవాడ కేంద్రంగా ఇటీవల జరిగిన 1800 లోపు అంతర్జాతీయ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చెస్ క్రీడాకారులకు అంతర్జాతీయ ఫిడే చెస్ ఆర్గనైజేషన్ తాజాగా రేటింగ్‌లను విడుదల చేయగా లిఖిత్ చైతన్య 1503 అంతర్జాతీయ చెస్ రేటింగ్ ను సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి అభినందించారు. అంతర్జాతీయ చెస్ రేటింగ్ క్రీడాకారులతో తలపడి వారిపైవిజయం సాధించడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో చెస్‌లో ఉన్నత స్థాయికి ఎదుగాలని సూచించారు. విద్యార్థుల మేధస్సుకు చెస్ క్రీడ పదను పెడుతుందన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి, ప్రిన్సిపల్ జి సరితారెడ్డి, విశ్వనాథ్ చెస్ అకాడమీ డైరెక్టర్, కోచ్ అంతగిరి రాజేంద్రప్రసాద్, పీఈటీలు మహేందర్, తిరుపతి, స్వామి, జహేదాలతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు అభినందించారు.

## జర్నలిస్టుల సమస్యలపై కలెక్టర్ కు టిడబ్ల్యూజెఎఫ్ వినతి

- వర్కింగ్ జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించండి: టిడబ్ల్యూజేఎఫ్



**కరపత్రం ప్రతినిధి మేడ్చల్/ కుత్బుల్లాపూర్ డిసెంబర్ 12**
మేడ్చల్ జిల్లా పరిధిలో పనిచేస్తున్న జర్నలిస్టుల సమస్యలపై శుక్రవారం జిల్లా కలెక్టర్ కు టిడబ్ల్యూజెఎఫ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. మేడ్చల్ జిల్లా టీడబ్ల్యూజెఎఫ్ నూతన కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కట్టెల మల్లేష్, గడ్డమీది అశోక్ లు మాట్లాడుతూ... మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు ఇల్లు, ఇళ్లస్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తున్న అక్రిడేషన్ కార్డులు ఇవ్వలేదని వెంటనే ప్రభుత్వం ఇవ్వాలని కోరారు. అనేక మంది జర్నలిస్టులు అనారోగ్యంతో బాధపడుతున్నారు వారికి వెంటనే హెల్త్ కార్డులు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు.
వయస్సు పైబడిన సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్ ఇవ్వాలన్నారు. విద్యాశాఖ అధికారులు జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు పాఠశాలలో ఉచిత విద్య అందించాలని తెలిపారు. చిన్న పత్రికలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించి ఎమ్ ప్యానల్ మెంట్లో చేర్చాలి, వ్యాపార ప్రకటనలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు శిక్షణ సౌకర్యాలు కల్పించాలని వివరించారు.
రాష్ట్రంలో జిల్లాల్లో మండలాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులపై జరుగుతున్న దాడుల నివారణకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా ప్రెస్ క్లబ్ కు స్థలం కేటాయించి భవనం నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. పై సమస్యలపై మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా జాయింట్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి స్పందించి మా పరిధిలో ఉన్న సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని మిగతా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర నాయకులు జగదీశ్వర్ గుప్తా, టిడబ్ల్యూజెఎఫ్ మేడ్చల్ జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, కావలి మోహన్, సహాయ కార్యదర్శి పి.శంకర్, చిన్న బాబు, రహీం ఖాద్రి, రమేష్, కొండల్ రెడ్డి, పర్వీజ్ అహ్మద్, డి. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## జంతర్‌మంతర్ ఢిల్లీని కుదిపేసిన బీసీల గర్జన

**కరపత్రం ప్రతినిధి న్యూఢిల్లీ డిసెంబర్ 12**
42% రిజర్వేషన్ బిల్లు వెంటనే పెట్టాలి – పెట్టకపోతే దేశవ్యాప్తంగా ముట్టడులు తప్పవని హెచ్చరిక! బీసీ హక్కుల కోసం పోరాడుతున్న వారిని అడ్డుకున్న కేంద్ర ప్రభుత్వ పోలీసుల అత్యాచారాన్ని ధిక్కరించిన భారీ నిరసన

**న్యూఢిల్లీ, జంతర్‌మంతర్:**
దేశ రాజధాని ఢిల్లీ జంతర్‌మంతర్‌లో శుక్రవారం బీసీల పోరాటం ఆగ్రహంతో ఉప్పొంగి పార్లమెంట్ వేదికను తాకింది.
42% రిజర్వేషన్ బిల్లు వెంటనే పార్లమెంటులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ వేలాది మంది బీసీ కార్యకర్తలు ఢిల్లీ వీధుల్లో ఆగ్రహజ్వాలలు రగుల్చారు. పార్లమెంట్ వైపు పాదయాత్రగా ముందుకు సాగిన నేతలను అడ్డుకునేందుకు పోలీసులు అడ్డుకోగా ఘర్షణాత్మక వాతావరణం నెలకొంది.

పోలీసుల దౌర్జన్యంపై ఆగ్రహంతో కార్యకర్తలు
"బీసీలను ఎవరూ అడ్డుకోలేరు!"
"పోలీసుల దౌర్జన్యం మాయమవ్వాలి!"



"42% బిల్లు పెట్టాలి.. ఇప్పుడే పెట్టాలి!"
అని ఢిల్లీ మొత్తం మార్మోగేలా నినాదాలు చేశారు.

**డాక్టర్ అరుణ్ కుమార్ ఆగ్రహ గర్జన**

"బీసీలకు న్యాయం జరిగేవరకు ఈ పోరాటం ఒక్క క్షణం కూడా ఆగదు. బిల్లు ఇవ్వకపోతే పార్లమెంటును, రాష్ట్ర ప్రభుత్వాలను కూడా ముట్టడించాల్సి వస్తుంది. ఇచ్చేవరకు మేము వెనక్కు తీయం!" అని డా. అరుణ్ కుమార్ ఢిల్లీ గగనతలాన్ని ఛేదించేలా గర్జించారు.

**ఆర్ కృష్ణయ్య కుమారుడిగా**
"మా నాన్న చేపట్టిన బీసీ ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి నేను సిద్ధం. బీసీల భవిష్యత్తు కోసం చివరి శ్వాస వరకు పోరాడతాను" అని ఆయన స్పష్టం చేశారు.

**"బీసీ సీఎం తప్పదు!" – ఆది మల్లేశం పటేల్ హెచ్చరిక**

"బీసీల రాజ్యాధికారం రాబోతోంది. ఎవరు అడ్డొస్తే వారిని ప్రజాస్వామ్యమే తిరస్కరిస్తుంది.
బీసీ ముఖ్యమంత్రి అవ్వడం ఖాయం.. ఇది మా శక్తి, ఇది మా గర్జన!" అని ఆది మల్లేశం పటేల్ హెచ్చరించారు.

**వందలాది మంది కార్యకర్తల రణభేరి**

ఈ భారీ ఆందోళనలో నీలం వెంకటేష్, గంగారం, పద్మ, జక్కని సంజయ్, అనంతయ్యతో పాటు వందలాదిమంది బీసీ కార్యకర్తలు పాల్గొని రిజర్వేషన్ పోరాటాన్ని చరిత్రలో నిలిచిపోయేలా చేశారు.

## గెలిచిన సర్పంచులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపిన సుడా చైర్మన్

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ డిసెంబర్ 12**
కాంగ్రెస్ పార్టీ బలపరచిన వారితో పాటు మిగతా సర్పంచులను సైతం కలిసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరి ఆహ్వానించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి
వారి వద్దకే వెళ్లి సుడా చైర్మన్ అభినందనలు తెలుపగా సంతోషం వ్యక్తం చేసిన సర్పంచులు
ఇప్పటికే పలు గ్రామాలలో సుడా నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టిన సుడా చైర్మన్
కొత్తపల్లి మండలం లోని గ్రామాలలో గెలిచిన సర్పంచ్ ల వద్దకే సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి స్వయంగా వెళ్లి శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. గత పది రోజులుగా ఎప్పటికప్పుడు వారి గెలుపుకోసం పాటుపడడమే కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి చేరవేసే విధంగా కృషి చేసి సుడా నిధుల ద్వారా చేస్తున్న అభివృద్ధితో పాటు



రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చి వారి గెలుపుకు సహకరించిన సుడా చైర్మన్ కు సర్పంచులు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సర్పంచులతో పాటు ఇతర సర్పంచులను సైతం కలిసి వారిని శాలువాతో సత్కరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.సుడా చైర్మన్



సన్మానం చేసిన వారిలో బోగొండ అయిలయ్య చామన్ పల్లి,కూర నరేష్ రెడ్డి చర్లభూత్కూర్,మోతె ప్రశాంత్ రెడ్డి దుబ్బపల్లి,గుర్రం సంధ్య తిరుపతి బహదూర్ ఖాన్ పేట్,బొద్దుల విజయలక్ష్మి ఫకీర్ పేట్,భాషవెని సరోజన మల్లేశం చేగుర్తి,వడ్లూరి అంజయ్య నల్లగుంట పల్లి,ఆకుల యాదగిరి తహర్ కొండా పూర్ ఉన్నారు.

## నాగారం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రణవ్..



**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట డిసెంబర్ 12**

**- కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించండి.గ్రామ సమస్యలకు పరిష్కారం చూపెట్టండి.**
**- పని చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి.**
**- గెలిచినా,ఓడినా ప్రజల మధ్యే ఉంటున్నా...సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తా..**

పనిచేసే ప్రభుత్వానికి అండగా ఉండాలని,గెలిచినా,ఓడినా ప్రజల మధ్య ఉంటూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తున్నానని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.శుక్రవారం రోజున జమ్మికుంట మండల పరిధిలోని



నాగారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ప్రదీప్–మమత తరుపున ఎన్నికల ప్రచారంలో పాల్గొనీ,భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.డప్పు చప్పుళ్ళతో,మంగళ హారతులతో గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు.అనంతరం నాగారం గ్రామంలోనీ అంజన్న స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన,అనంతరం ఆయన మాట్లాడుతూ ఏ ఎన్నిక ప్రచారం అయినా ఇక్కడి నుండే ప్రారంభిస్తున్నామని,హుజూరాబాద్ నియోజకవర్గానికి ఈశాన్యాంగా ఉన్న ఈ ప్రాంతం,ఇక్కడి ఆంజనేయ స్వామి అత్యంత మహిమ కలిగినదని,స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని రాబోయే రోజుల్లో ప్రతి ఇంటికి మరిన్ని సంక్షేమ పథకాలు అందజేస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో జమ్మికుంట మండల,గ్రామ శాఖ నాయకులు పాల్గొన్నారు.
20